క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కన్నాయిగూడెం: మండలంలో విద్యుత్ సరఫరాకు గురువారం అంతరాయం ఏర్పడనుందని కన్నాయిగూడెం ఏఈ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 33 కేవీ లైన్ పనుల నిమిత్తం గురువారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

గొల్ల కురుమలకు గొర్రెలు ఇవ్వాలి

ఏటూరునాగారం: గొల్ల కురుమలకు ప్రభుత్వం ముంజూరు చేసిన గొర్రెలను ఇవ్వాలని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం గొల్ల కురుమలకు గొర్రెలు ఇస్తామని డీడీలు కట్టించుకొని ఇవ్వలేదని అన్నారు. గొర్రెల కోసం కొంతమంది అప్పులు చేసి డీడీలు కట్టారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం గొర్రెలు వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. గొర్రెలు ఇప్పించాలని మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.

పట్టుపడిన వాహనాలకు వేలం

కాటారం: స్థానిక ఎక్సైజ్ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలకు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు గురువారం వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ నరేందర్ తెలిపారు. ఆరు ద్విచక్రవాహనాలు వేలానికి ఉండగా అందులో ఒకటి రోడ్ వర్తీ, ఐదు స్క్రాప్ కింద వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఉదయం 9 గంటలు ఎక్సైజ్ స్టేషన్‌లో నిర్వహించే వేలంలో పాల్గొనాలని కోరారు. వివరాలకు ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఆర్టీఐ గ్రామ కన్వీనర్‌గా తిరుపతి



రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట గ్రామానికి చెందిన ఇప్పకాయల తిరుపతిని యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ గ్రామ కన్వీనర్‌గా నియమించినట్లు మండల కన్వీనర్ మాస్ రాజు తెలిపారు. తన నియామకానికి సహకరించిన మండల, జిల్లా నాయకులకు తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు.

గోమాతకు పూజలు

చిట్యాల : మండల కేంద్రంలో హనుమాన్ మాలధారులు గ్రామ దేవతల వద్ద గోమాతను బుధవారం వివిధ అలంకరణలతో పూజలు చేశారు. గోమాతను పూజించి పండ్లు, నైవేద్యం, ఆహారం, అందించారు. గ్రామంలో అందరూ సుఖసంతోషాలతో ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించాలని ప్రదక్షణలు చేశారు.

నీళ్లనుకొని టర్పంటైల్ తాగాడు

పరకాల : తాగునీరు అనుకొని నాలుగేళ్ల బాలుడు టర్పంటైల్ (రంగుల్లో కలిపే రసాయనం) తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఘటన బుధవారం పరకాలలో చోటుచేసుకుంది. కొత్త మున్సిపాలిటీ కార్యాలయానికి సమీపంలోని బేడ బుడిగజంగాల కాలనీకి చెందిన శేఖర్ తన ఇంటి పక్కనే షెడ్డు కోసం ఉపయోగించే రాడ్లకు రంగుల కోసం కుమారుడు (బిట్టు)ను వెంట తీసుకొని వెళ్లాడు. ఇంటికి వస్తున్న సమయంలో శేఖర్ తన కుమారుడిని వాహనంపై వదిలిపెట్టి పక్కనే దుకాణంలోకి వెళ్లాడు. ఇంతలో ఆ బాలుడు మంచినీళ్లు అనుకొని టర్పంటైల్ తాగేశాడు. ఉన్నట్టుండి కుమారుడు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో భయపడిన బాలుడి తండ్రి శేఖర్ స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. బాలుడి పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం తరలించారు.

దరఖాస్తుల స్వీకరణ

పరకాల : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు హార్టికల్చర్ పంటలపై అవగాహన కల్పించాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో పండ్ల తోటల పెంపకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆంజనేయులు మాట్లాడుతూ మండలానికి ఈజీఎస్ ద్వారా పండ్లతోటల పెంపకానికి 70 ఎకరాల మంజూరు అయినందున అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పైడిపల్లి చెరువులో ఘర్షణ

పరకాల : మండలంలోని పైడిపల్లి చెరువు నుంచి నాగారం గ్రామానికి చెందిన ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలించడాన్ని అడ్డుకోబోయిన మాజీ సర్పంచ్ భర్త సురేష్‌కు,ట్రాక్టర్ డ్రైవర్లకు ఘర్షణ జరిగింది. దీంతో తమ చెరువు నుంచి మట్టిని తరలించకూడదని.. జీపీకి ఒక్కో ట్రాక్టర్ మట్టికి రూ.100 చెల్లించాలన్నారు. లేనిపక్షంలో చెరువు నుంచి మట్టి వెళ్లనివ్వబోమని అడ్డుకోవడంతో తాము పంటపొలాలకు తరలిస్తున్నామంటూ నాగారం చెందిన డ్రైవర్లు గొడవకు దిగారు.దీంతో వాగ్వావాదం పెరిగి దాడికి దారి తీసినట్లు సమాచారం. తనపై జరిగిన దాడికి మాజీ సర్పంచ్ భర్త దేవేందర్‌రెడ్డితో పాటు మరికొందరు ట్రాక్టర్ డ్రైవర్లపై సురేష్ పరకాల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

లైసెన్స్ డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి



ములుగు రూరల్: రైతులతో మాట్లాడుతున్న ఏఓ మునుకుంట్ల సంతోష్

ములుగు రూరల్: రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని, రశీదులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని మండల వ్యవసాయ అధికారి మునుకుంట్ల సంతోష్ సూచించారు. బుధవారం మండలంలోని ఇంచర్ల, జగ్గన్నగూడెం, పెగడపల్లి, భూపాల్‌నగర్, జాకారం గ్రామాల్లో రైతులకు విత్తన కొనుగోలుపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పొలాలను సారవంతం చేసుకునేందుకు పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై అందిస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రామాల్లో విత్తనాలు అమ్మకాలు చేపడితే కొనుగోలు చేయకూడదని, వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. రైతులు ఒకేరకం విత్తనాలను సాగుచేయడం కంటే వివిధ రకాల విత్తనాలను సాగుచేయడంతో మేలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తర్ణాధికారులు, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు చేసిన విత్తనాలకు బిల్లులివ్వాలి

ఏటూరునాగారం : రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు విత్తన డీలర్లు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఖరీఫ్ సీజనల్‌లో రైతులు కొనుగోలు చేయాల్సిన విత్తనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనలు కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ



సాయిరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన జంగా సాయిరెడ్డి (80) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని మంత్రి సీతక్క పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాయిరెడ్డి మృతి చాలా బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అలాగే మేడారం గ్రామానికి చెందిన పార్టీ యూత్ అధ్యక్షుడు సిద్దబోయిన రమేష్ నానమ్మ లక్ష్మీ ఇటీవలే మృతి చెందగా ఆమె కుటుంబాన్ని మంత్రి సీతక్క పరామర్శించి నివాళులర్పించారు. ఆమె వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా మహిళా అధ్యక్షురాలు రేగ కళ్యాణి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవి చందర్, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్‌గౌడ్, మేడారం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అర్రెం లచ్చుపటేల్, గౌరవ మండల అధ్యక్షుడు జాలపు అనంతరెడ్డి, మాజీ ఎంపీటీసీ బత్తిని రాజు, ఎస్టీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న ఉన్నారు.

వ్యాక్సినేషన్ వివరాలు నమోదు చేయాలి



వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న భవ్యశ్రీ

వెంకటాపురం(కె): ఆన్‌లైన్‌లో చిన్నారులకు ఇస్తున్న వ్యాక్సినేషన్ వివరాలు, లబ్ధిదారుల వివరాలను నమోదు చేయాలని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆలుబాక, వీరభద్రవరం సబ్‌సెంటర్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ సెంటర్లలో చిన్నారులకు ఇస్తున్న వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై వివరించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని నిర్వీర్యం చేసిన బీజేపీ



కూలీలతో మాట్లాడుతున్న శ్రీకాంత్, నాయకులు

కాటారం: గ్రామీణ నిరుపేద కూలీలకు పాలిటవరంగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని నూతన సవరణల పేరిట బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్ ఆరోపించారు. మండల కేంద్రంలోని అట్టి చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం శ్రీకాంత్ సందర్శించి కూలీలతో మాట్లాడారు. డిమాండ్‌కు అనుగుణంగా కూలీలకు పని కల్పించడం లేదని, కేంద్ర ప్రభుత్వం ఉపాధి కార్మికులపై కక్ష గట్టి ఉపాధిని తొలగించాలని కుట్ర పన్నుతుందని పేర్కొన్నారు. మార్చిలోగా కూలీలకు 100 రోజుల పని చూపించాల్సి ఉండగా అలా జరగడం లేదని కూలీలు ఆర్థిక సంవత్సరంలో 60 లేదా 70 రోజులు పని చేసి మిగతా రోజులు నష్టపోతున్నారని తెలిపారు. ఉపాధి కార్మికులకు రూ.12వేలు, మహిళలకు రూ.2500 ప్రతి నెలా ఇస్తామని రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ పథకాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్మికుడిపై ఉందన్నారు. శ్రీకాంత్ వెంట నాయకులు బొడ్డు కిషోర్, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కాటారం: మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మారుపాక వెంకటి తన ద్విచక్ర వాహనంపై మహదేవపూర్ రోడ్డు నుంచి మండల కేంద్రం వైపుగా రావడానికి మూలమలుపు తిరుగుతున్నాడు. ఇదే క్రమంలో కాళేశ్వరం వైపు నుంచి వస్తున్న ఆటో ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. దీంతో వెంకటికి గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సీనియర్ పాత్రికేయుడు బొర్రాజు క్షతగాత్రుడు వెంకటికి చికిత్స నిమిత్తం రూ.2వేలు ఆర్థిక సాయం అందించారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వాజేడు : మండల పరిధిలోని ప్రగళ్లపల్లి గ్రామం వద్ద వాజేడు, భద్రాచలం రహదారిపై వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రయాణికుల బ్యాగులను సోదాలు చేయడంతో పాటు ప్రయాణికులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొత్త వ్యక్తులు, అపరిచితులు, అనుమానితులు తారస పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వాహనదారులను వారు ఆదేశించారు.

ఘనంగా హనుమాన్ నగర సంకీర్తన



హనుమాన్‌స్వామి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

చిట్యాల: మండలంలోని వెంకట్రావుపల్లి(సీ) గ్రామానికి చెందిన హనుమాన్ స్వామి భక్తులు బుధవారం నగర సంకీర్తన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి ఊరేగింపుగా గ్రామంలోని అన్ని వీధుల గుండా తిరుగుతూ జై శ్రీరాం- జై హనుమాన్ నినాదాలతో మారుమోగించారు. అనంతరం మహిళలు, భక్తులు స్వామివారి చిత్రపటానికి కొబ్బరికాయలతో, పూలమాలలతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తులు మాసు రమేష్, బ్రహ్మం, చారి, చిలకుల సదానందం, సదానందం తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ఆస్తుల పరిశీలన



పెద్దకోమటిపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీఓ



కర్కపల్లిలో సెగ్రిగేషన్ షెడ్‌ను పరిశీలిస్తున్న డీపీఓ


- ఒక్కో గ్రామంలో ఐదు గుర్తింపు
- కల్పించాల్సిన సౌకర్యాలపై వివరాల సేకరణ
- ఈ-పంచాయతీ పోర్టల్లో నమోదు

మొగుళ్లపల్లి : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, ప్రగతి పనులు గ్రామాల్లో ఏ విధంగా అమలవుతున్నాయనే అంశంపై పంచాయతీ అధికారులు సమగ్ర సమాచారం సేకరిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఈనెల 20 నుంచి డీపీఓ, డీఎల్‌పీఓ, ఎంపీఓలు గ్రామాల వారీగా పర్యటిస్తున్నారు. ఒక్కో గ్రామంలో 5 పంచాయతీ ఆస్తులను పరిశీలించి, పనిచేస్తున్న విధానంపై గ్రేడింగ్ ఇస్తున్నారు.

గ్రేడింగ్ ఇవ్వాలి

జిల్లాలోని 11 మండలాల పరిధిలో 241 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఒక్కో పంచాయతీలో 5 ప్రభుత్వ ఆస్తులను గుర్తించి, వివరాలు నమోదు చేయాల్సి ఉంది. ప్రతీ గ్రామంలోని క్రీడాప్రాంగణం, వైకుంతధామం, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్డును పంచాయతీ అధికారులు పరిశీలిస్తున్నారు. డీపీఓ మండలానికో గ్రామపంచాయతీ, డీఎల్‌పీఓ మండలానికి మూడు పంచాయతీలు, ఎంపీఓలు అన్ని పంచాయతీల్లోని క్రీడాప్రాంగణం, వైకుంతధామం, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీ, సెగ్రిగేషన్‌షెడ్డును తప్పనిసరిగా పరిశీలించాల్సి ఉంటుంది. తెలంగాణ క్రీడా ప్రాంగణం విద్యార్థులు, యువకులకు అనుకూలంగా ఉందా లేదా, క్రీడా పరికరాలు అందుబాటులో ఉన్నాయా లేదా, ప్రతీరోజు ఏయే ఆటలు ఆడుతున్నారనే వివరాలు సేకరించాలి. వైకుంతధామంలో విద్యుత్, నీటిసౌకర్యం ఉన్నాయా లేవా, గ్రామస్తులు ఉపయోగిస్తున్నారా లేదా, ఉపయోగించకుంటే కారణాలు తెలుసుకోవాలి. పల్లె ప్రకృతి వనంలో నాటిన మొక్కలు, పండ్ల మొక్కలు, నర్సరీలో పెంచుతున్న మొక్కలు, నీటి సౌకర్యం తదితర వివరాలు నమోదు చేయాలి.సెగ్రిగేషన్ షెడ్డును ఉపయోగిస్తున్నారా లేదా, తడి, పొడి చెత్తను వేరు చేస్తున్నారా లేదా, కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారా లేదా వంటి వివరాలను సేకరిస్తున్నారు. ఈ ఐదింటిని ప్రజలు ఏ మేరకు ఉపయో గించుకుంటున్నారు, ఇంకా కల్పించాల్సిన సౌకర్యాలను సూచించాలి. ఆయా గ్రామాల్లో వాటి పనితీరును తనిఖీ చేసి ఏ, బీ, సీ, డీ గ్రేడింగ్ ఇస్తున్నారు. ఏ-చాలా బాగుంది, బి-బాగుంది. సీ-పరవాలేదు, డి-నిరుపయోగం అనే గ్రేడ్లను ఇస్తూ ఆన్‌లైన్‌లో ప్రతీరోజు వివరాలు నమోదుచేస్తున్నారు.

30లోగా నమోదుకు చర్యలు



గ్రామపంచాయతీల్లో పైన పేర్కొన్న ఐదు ఆస్తులను ప్రజలు ఉపయోగిస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం. కల్పించాల్సిన సౌకర్యాలపై వివరాలు సేకరిస్తున్నాం. అన్ని గ్రామాల్లో పరిశీలించి, ఈ నెల 30లోగా ఈ-పంచాయతీ పోర్టల్లో నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- నారాయణరావు, డీపీఓ

ఉచిత నేత్ర వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

శాయంపేట : మండలంలోని ప్రగతి సింగారం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బుధవారం ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్ లయన్స్ క్లబ్ పరకాల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఆప్తాల్మిక్ డాక్టర్ జి.వెంకటనారాయణ 86 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం కంటి చూపు మందగించిన 30 మందికి సికింద్రాబాద్‌లోని వెస్ట్ మారేడ్‌పల్లి పుష్పగిరి కంటి ఆస్పత్రిలో జూన్‌లో ఉచిత శస్త్ర చికిత్సలు చేయించనున్నట్లు తెలిపారు. వీరికి ఉచిత రవాణా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ వెంకన్న పాల్గొన్నారు.

భానుడి భగభగ

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- విలవిలలాడున్న ప్రజలు
- బయటకు వెళ్లాలంటేనే జంకుతున్న జనం
- జాగ్రత్తలు పాటిస్తేనే ఉపశమనం...



ఎండకు సోడాబండి వద్ద నిమ్మరసం తాగుతున్న ప్రజలు

మొగుళ్లపల్లి: భానుడి భగభగకు రెండు రోజుల నుంచి ప్రజలు విలవిలలాడిపోతున్నారు. బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఎండలో తిరగడం వల్ల డీహైడ్రేషన్‌తో ప్రాణాపాయ స్థితికి చేరుకునే అవకాశం లేకపోలేదు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అప్రమత్తతే జౌషధమని, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచిస్తున్నారు. వేసవిలో ఎక్కువగా జ్వరాలు, డయేరియా వడదెబ్బ వంటివి వస్తాయి. ఎక్కువశాతం మంది ప్రజలు ఎండను సైతం లెక్కచేయకుండా తమ పనులను ఎండలోనే చేసుకుంటుంటారు. ఇది ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుత వేసవిలో ప్రజలు ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, రైతులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారు వడదెబ్బకు గురయ్యే అవకాశముంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

కలుషిత ఆహారంతో డయేరియా..

కలుషిత ఆహారంతో డయేరియా ప్రబలే ప్రమాదం ఉంటుంది. వాంతులు, విరోచనాలు ఎక్కువ అవడం వలన నీరసించిపోతారు. డయేరియా లక్షణాలు కనిపించిన వెంటనే ఆస్పత్రికి వెళ్లాలి. వెళ్లే ముందు ఓఆర్ఎస్ ప్యాకెట్లు గానీ, ఉప్పు, పంచదార కలిపిన నీరు తాగించాలి. ముఖ్యంగా మహిళలు వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

ఇలా చేస్తే మేలు..

- సురక్షిత నీటినే తాగాలి
- కాచి చల్లార్చిన నీరు తాగితే మంచిది
- ఆహారంపై మూతలు పెట్టి ఉంచాలి
- నిల్వ ఉన్న ఆహారాన్ని తినకూడదు
- ద్విచక్రవాహనాదారులు హెల్మట్ ధరించాలి
- ఉప్పు కలిపిన ద్రావణాన్ని తీసుకోవడం ఉత్తమం
- తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి
- పండ్లను ఎక్కువగా తీసుకోవాలి
- ఎండలో తిరగడం మానుకోవాలి
- వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి
- ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలి
- ఇంటి ఆవరణలో దోమల నివారణ మందు చల్లించాలి.

అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉంది. వీలైనంతగా వరకు పనులను ఉదయం పూట గానీ సాయంత్రం సమయాల్లో గానీ చేసుకోవాలి. ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, గంజి వంటి ద్రావణాలు తీసుకోవాలి. ఆహారంలో ఒక పండు ఉండే విధంగా చూసుకోవాలి.

- నాగరాణి, పీహెచ్‌సీ వైద్యాధికారి, మొగుళ్లపల్లి

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



మల్హర్ : విత్తన షాపును తనిఖీ చేస్తున్న ఎస్సై నరేష్



రేగొండ : స్టాక్ వివరాలను పరిశీలిస్తున్న ఎస్సై



మహాముత్తారంలో..

మల్హర్: నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసం చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై వడ్లకొండ నరేష్, మండల వ్యవసాయ అధికారి సుధాకర్ డీలర్లను హెచ్చరించారు. మండలంలోని కొయ్యూరులోని ఎరువులు, పురుగుమందులు, విత్తన దుకాణాలను ఏఓతో కలిసి ఎస్సై తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు కావాల్సిన అన్ని రకాల నాణ్యమైన విత్తనాలు అందించాలని సూచించారు. ప్రభుత్వ నియమ, నింబంధనలకు లోబడి క్రయవిక్రయాలు జరపాలని దుకాణాదారులను ఆదేశించారు. విత్తనాలను బ్లాక్ మార్కెట్‌లోకి తరలించి అధిక ధరలకు అమ్మితే షాపు లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

రేగొండ: రైతులకు ఎవరైనా వ్యాపారులు నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రవికుమార్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపుల్లో ఏఓ వాసుదేవరెడ్డితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్‌షాపులోని స్టాక్ రికార్డులు, బిల్ బుక్కులను పరిశీలించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలతో పాటు పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామన్నారు. డీలర్లు విత్తనాలను పర్మిషన్ ఉన్న కంపెనీ నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి రైతులకు అమ్మకాలు చేయాలన్నారు. ధరల పట్టిక, స్టాక్ వివరాలు రైతులకు కనిపించే విధంగా ఉంచాలన్నారు. బ్లాక్ మార్కెటింగ్ చేయరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సరైన పత్రాలు కలిగి ఉండాలి

మహాముత్తారం: డీలర్లు నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై మహేందర్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కొర్లకుంట, యామన్‌పల్లి, మహాముత్తారం గ్రామాల్లోని ఎరువు, పురుగుల మందుల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులు, పత్తి విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. అదేవిధంగా ప్రతీ ఒక్కరూ షాపు లైసెన్స్, సరైన పత్రాలు కలిగి ఉండాలన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ



గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న రాజు

రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండలంలోని చిన్నకోడెపాక గ్రామంలోని గ్రంథాలయానికి డాక్టర్ నోముల రాజు తాను రచించిన జాంబ పురాణం పుస్తకాలను గ్రంథాలయ నిర్వాహకుడికి అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఆది పురుషుడైన జాంబవంతుని గురించి సమస్త మానవాళి తెలుసుకుని, ముందుతరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాలకులు కనకం రమేశ్, యూత్ నాయకులు బొట్ల కుమార్, మామిడి శివ, మంద వెంకటేశ్వర్లు, సురేష్, రాజు కుమార్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు : 9705748198
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 8074606274